క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి ప్రణీత్‌రెడ్డి నివాళి



ఆదాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఎంపీపీ మల్లికార్జునరెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని దేవరంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంట ఆదాం ఇటీవల మృతిచెందారు. శనివారం పెద్దకర్మ నిర్వహించగా, పార్టీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి హాజరై ఆదాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదాం భార్య ప్రమీల, కుమార్తె శ్రావణసంధ్యను ఓదార్చారు. ఆయన వెంట ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ సోము, సర్పంచ్ మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో నేటి నుంచి నిత్య అన్నదానం

చీమకుర్తి: చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో ఆదివారం నుంచి అయ్యప్పస్వామి స్వామిమాలలు ధరించిన భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం హరిహరక్షేత్రంలో అయ్యప్పస్వామి కలశ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏటా సర్వ మాలల భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని భిక్షను స్వీకరించాలని కోరారు.

అందరికీ పనులు కల్పించడం అభినందనీయం

- ఫీల్డ్ అసిస్టెంట్లతో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

మద్దిపాడు: ఉపాధి హామీ పథకం ద్వారా అందరికీ పనులు కల్పిస్తూ వారి జీవనానికి సహాయ సహకారాలు అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు అభినందనీయులని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండలంలోని మల్లవరం వద్ద ఉన్న విజయభవన్‌లో శనివారం సంతనూతలపాడు నియోజకవర్గ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హయాంలో ప్రారంభమైన సమయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వద్ద రాష్ట్ర యువజన పార్టీ అధ్యక్షునిగా తాను పని చేశానని తెలిపారు. ఆ సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలుకు పలు వర్క్‌షాపులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించామని అన్నారు. పని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తూ వలసలు పోకుండా గ్రామంలోనే ఉపాధి పొందే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. సమావేశం అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపాటి రమేష్, పార్టీ టీఎస్‌టీయూసీ విభాగం సంతనూతలపాడు నియోజకవర్గ మండలాల కన్వీనర్లు పూజల చంద్రయ్య, రావూరి నరసింహారావు, కొడాలి శ్రీనివాసరావు, కొత్తపల్లి వెంకట సుబ్బయ్య, కో కన్వీనర్ సన్నపురెడ్డి రమణమ్మ, నాలుగు మండలాల ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కన్వీనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- పనులను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలోని 31వ డివిజన్ విజయనగర్ కాలనీలో పార్కు అభివృద్ధి పనులకు వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి శనివారం భూమి పూజ చేశారు. డ్వామా కార్యాలయం పక్కనున్న పార్కు వద్ద టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికిగానూ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా నగరంలో మొత్తం 21 పనులను చేపట్టనున్నామన్నారు. అందుకుగానూ తొలి విడతగా రూ.3.91 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అందులో భాగంగా పార్కు పనులకు ప్రణీత్‌రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం నిధులతో ఒంగోలు నగరంలోని వివిధ పార్కుల సుందరీకరణ, నడక మార్గాలు, ఎండ్ టూ ఎండ్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఆయా కార్యక్రమాలు వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం కొత్తగా నియమితులైన వలంటీర్లకు ప్రణీత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్‌కు నియామకపత్రం అందజేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి, కార్పొరేటర్ నాగజ్యోతి

సమన్వయంతో పనిచేద్దాం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

నాగులుప్పలపాడు: ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి కోరారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేపడుతున్న మంచి పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందించాలని కోరారు. అనంతరం పలు శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో రబీ సీజన్‌లో రైతులకు అందిస్తున్న పలు పథకాల గురించి ఏవో వివరించారు. రెవెన్యూ శాఖపై నిర్వహించిన సమీక్షలో ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేపై ఎలాంటి ఫిర్యాదులున్నా రైతులు తెలియజేయాలని కోరారు. అనంతరం విద్యుత్‌శాఖపై జరిగిన సమీక్షలో మండలంలోని కనపర్తి, ఉప్పుగుండూరు, చీర్వానుప్పలపాడు గ్రామాల్లో ఉన్న పలు విద్యుత్ సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. ఎంపీడీవో జయమణి, తహసీల్దార్ సుజన్‌కుమార్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ సుజన్ కుమార్, వేదికపై ఎంపీపీ అంజమ్మ

విద్యార్థుల అభ్యసన స్థాయి పెంచడానికి కృషి చేయాలి

- సమగ్రశిక్ష సహిత అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్

మద్దిపాడు: మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలను సమగ్రశిక్ష సహిత అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం.రమేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ లెసన్ ప్లాన్ రికార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సోమవారం నుంచి జరిగే మిడ్‌లైన్ టెస్ట్‌కు 3, 4, 5 తరగతుల విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో పాల్‌లాబ్ పనితీరును హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఇంగ్లిష్ క్లాస్‌ను పరిశీలించారు. ముందుగా గ్రామంలో ఇంటి వద్ద రిసోర్స్ పర్సనర్ల ద్వారా విద్యనభ్యసిస్తున్న శ్రీజను కలిసి విద్యార్థిని ప్రగతిని తెలుసుకున్నారు. ప్రతి సోమవారం మద్దిపాడులోని భవిత కేంద్రానికి ఫిజియోథెరపీ సేవల కోసం విద్యార్థిని తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లు సుజాత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న రమేష్, ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థి

ఒంగోలు సెంట్రల్: 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఒంగోలు మాంటిస్సోరి విద్యార్థి పాదర్తి హారిక్ సాయి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నూరుద్దీన్ తెలిపారు. ఒంగోలు పీవీఆర్ బాయ్స్ హైస్కూల్‌లో జరిగిన 67వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో 13 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థి పాదర్తి హారిక్ సాయి ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో డిసెంబర్‌లో జైపూర్‌లో జరగనున్న పోటీల్లో సాయి పాల్గొననున్నట్లు తెలిపారు. సాయికి పాఠశాల కరస్పాండెంట్ శబరినాథ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



విద్యార్థికి అభినందనలు తెలుపుతున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

తెలుగు భాషపై కవులకు ఎనలేని ప్రేమ

నాగులుప్పలపాడు: తెలుగు ఉచ్చరణ, వ్యాకరణంపై కవులకు ఎనలేని ప్రేమ ఉంటుందని ప్రముఖ కవి, తెలుగు ఉపాధ్యాయుడు గాధంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరు గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొని తెలుగు భాష ఆవశ్యకతను అవధాన విధానాన్ని వివరించారు. గ్రంథపాలకుడు ప్రసాద్ కవులను సత్కరించారు. చలపతిరావు, బొమ్మల వెంకటేశ్వరరావు, చుండూరి రఘు, కెల్లేటి శ్యాం, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పశు ఆరోగ్య కార్డులతో రైతులకు ప్రయోజనాలు

- పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి

నాగులుప్పలపాడు: పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పశు ఆరోగ్య కార్డుల ద్వారా చాలా ప్రయోజనాలు ఉన్నాయని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి తెలిపారు. నాగులుప్పలపాడు మండలంలోని పోతవరం గ్రామంలో పశు ఆరోగ్య కార్డులపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి రైతులతో జేడీ బేబీరాణి మాట్లాడుతూ పశు కార్డులతో ప్రభుత్వం పాడి రైతులకు అందించే అన్ని ప్రయోజనాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువుల రైతులకు నేరుగా ఇంటికే ఈ కార్డులు అందుతాయని తెలిపారు. 4 నెలల నుంచి 8 నెలల వయసున్న పడ్డ దూడలకు బ్రూసెల్లస్ టీకాలు కూడా వేయనున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలోని పాడి రైతుల ఇళ్లకు వెళ్లి పశు ఆరోగ్య కార్డులు అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ సహాయకులు లావణ్య, రాంబాబు పాల్గొన్నారు.



పశు ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న జేడీ బేబీరాణి

బ్యాంకు పరీక్షలకు ఉచిత శిక్షణ

ఒంగోలు: బ్యాంకు పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు లాజిక్ అకాడమీ డైరెక్టర్ పి.విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 8283 జూనియర్ అసోసియేట్ పోస్టులు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ విభాగాల్లో 80 వేలకు పైగా కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక అంజయ్య రోడ్డులోని తమ సంస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులకు బ్యాంకు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 90 రోజులపాటు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 23వ తేదీలోపు తమ పేర్లు నమోదుచేసుకోవాలన్నారు. వివరాలకు 7207012758 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎస్‌వీఎస్ ప్రసాద్‌కు విశిష్ట కళా ప్రపూర్ణరత్న పురస్కారం

ఒంగోలు మెట్రో: తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సాంస్కృతిక సంగీత సాహిత్య నృత్య సమ్మేళనం –2023 సందర్భంగా ప్రకాశం జిల్లా పేర్నమిట్టకు చెందిన సంగుబొట్ల వెంకట శివప్రసాద్‌ను తెలుగు వెలుగు విశిష్ట కళా ప్రపూర్ణరత్న జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్‌చార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. డిసెంబర్ 10వ తేదీ విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే తెలుగు వెలుగు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.



ఎస్‌వీఎస్ ప్రసాద్

ప్రభుత్వ భవన నిర్మాణాలను పరిశీలించిన అధికారులు

ఒంగోలు రూరల్: మండలంలోని దేవరంపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాల పురోగతిని అధికారులు శనివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాఠశాలలో నాడు–నేడు పనులను ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఏఈ సందీప్‌ను కోరారు. ఆయన వెంట సచివాలయ ఇంజినీర్ ప్రదీప్, గ్రామ కార్యదర్శి స్వాతి ఉన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్ పనులను పీఆర్ ఏఈ శేషగిరి పరిశీలించారు.



పాఠశాల స్లాబు పనులను పరిశీలిస్తున్న ఒంగోలు ఎంఈవో కిషోర్‌బాబు

రూ.50 లక్షలతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: మండల పరిషత్ నిధులు రూ.50 లక్షలతో జీఎల్ పురం – రామచంద్రాపురం మధ్య వంతెన నిర్మాణానికి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన చేశారు. అనేక ఏళ్ల నుంచి రెండు గ్రామాల మధ్య వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకల సమయంలో ఇరుగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీంతో వంతెన నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు కడియాల మల్లికార్జున, తిరుపతిస్వామి, వెంకట్రావు, రమణారెడ్డి పాల్గొన్నారు.

బేస్‌బాల్ రాష్ట్ర జట్టుకు నిడమానూరు విద్యార్థిని

నాగులుప్పలపాడు: డిసెంబర్‌లో ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు మండలంలోని బీ నిడమానూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొండ స్రవంతి ఎంపికైనట్లు అబ్దుల్ కరీంసాహెబ్ తెలిపారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు గుంటూరు జిల్లా వెలిగండ్లలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టులో పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు స్రవంతి ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఆమెను అభినందించారు. పీఈటీ గడ్డం వెంకట్రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



స్రవంతిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు